సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 21 । జనవరి । 2023



బొగ్గు శుద్ధి ఇక ఉండదు..

సింగరేణి బొగ్గును శుద్ధి చేసేందుకు మణుగూరులో ఏర్పాటు చేసిన గ్లోబల్ కోల్ వాషరీ ప్లాంట్ మూసివేతకు రంగం సిద్ధమైంది. 8లో



'డబుల్' ఇళ్ల కోసం ఆందోళన

పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ ఎన్డీ ఆధ్వర్యంలో ఇల్లెందులో ఆందోళన చేపట్టారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 18°

వాతావరణం

జిల్లాలో శనివారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగా ఉంటాయి. ఉదయం, రాత్రి వాతావరణం చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్వర్ణకవచాలంకరణలో భద్రాద్రి రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు శుక్రవారం స్వర్ణకవచాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం–జగన్నాథపురం గ్రామాలమధ్య కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేం, అర్చన తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు సమర్పించిన తర్వాత హారతి ఇచ్చారు. అనంతరం నివేదన, పంచ హారతులు, నీరాజన మంత్రపుష్పం నిర్వహించారు. కాగా, మాస శివరాత్రిని పురస్కరించుకుని రుద్రహోమం చేశారు. అమ్మవారు, స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను యాగశాలకు తీసుకొచ్చి, మండపారాధన, గణపతి పూజ అనంతరం హోమం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఈఓ రజనీకుమారి, అర్చకులు పద్మనాభశర్మ, రవికుమార్ శర్మ, దుర్గాప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

వర్షపాత నమోదు కేంద్రం ప్రారంభం



వర్షపాత కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఓ

సుజాతనగర్: సుజాతనగర్ తహసీల్దార్ కార్యాలయంలో వర్షపాత నమోదు కేంద్రాన్ని సీపీఓ యు.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కేంద్రం ద్వారా వర్షపాతం వివరాలు తెలుసుకోవచ్చని అన్నారు. సుజాతనగర్‌లో మాన్యువల్ వర్షపాత నమోదు కేంద్రం లేనందున ఆటోమెటిక్ మిషన్ ద్వారా ఇప్పటి వరకు వర్షపాతం వివరాలు అందించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి.సునీల్‌కుమార్ రెడ్డి, డీటీ సునీల్ కుమార్ రెడ్డి, ఏఎస్‌ఓ నరసింహారావు, ఆర్‌ఐ కాంతారావు పాల్గొన్నారు.

వలస ఆదివాసీ గ్రామాల్లో ఎన్‌హెచ్‌ఆర్‌సీ బృందం



ఆదివాసీలతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

చర్ల: మండలంలోని వలస ఆదివాసీ గ్రామాలను జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) బృందం శుక్రవారం సందర్శించింది. కమిషన్ అధికారి మదన్‌గోపాల్ నేతృత్వాన సభ్యులు మండలంలోని కందిపాడు, క్రాంతిపురం గ్రామాల్లో పర్యటించి వలస ఆదివాసీల జీవన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడికి రావడానికి కారణాలు, ఇక్కడ జీవన విధానం, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వలస ఆదివాసీలు తమకు పోడు భూముల హక్కుపత్రాలు ఇవ్వడం లేదని, కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం లేదనే సమస్యలను విన్నవించారు. బృందం వెంట సీసీఎఫ్ భీమ్లానాయక్, డీఎఫ్‌ఓ బాబు, తహసీల్దార్ బి.భరణిబాబు, ఎఫ్‌ఆర్‌ఓ ఉపేందర్, ఆర్‌ఐ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

గూడెంపైనే నజర్!



ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ సభా వేదికపై నేతలతో జలగం వెంకట్రావు (ఫైల్)

తానే బరిలో ఉంటానంటున్న సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా

- ఇటీవలి ఖమ్మం సభకు హాజరైన జలగం
- తెరపైకి కొత్తగా తుమ్మల పేరు..
- రసకందాయంలో బీఆర్‌ఎస్ రాజకీయం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఈనెల 18న ఖమ్మంలో నిర్వహించిన భారత రాష్ట్ర సమితి తొలి సభ వేదిక సాక్షిగా కొత్తగూడెం అసెంబ్లీ సీటుపై చర్చ మరోసారి మొదలైంది. జిల్లాలో ఏకైక జనరల్ సీటుగా ఉన్న కొత్తగూడెం నుంచి పోటీ చేసేందుకు అన్ని పార్టీల నుంచి ఆశావహులు ఎక్కువగా ఉన్నారు. అందులోనూ అధికార పార్టీలో ఈ స్థానం నుంచి ఎవరు పోటీలో ఉంటారనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట స్థానాలు ఎస్టీలకు కేటాయించారు. ఇక జనరల్ సీటు కొత్తగూడెం ఒక్కటే. గత అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ తరఫున జలగం వెంకట్రావు పోటీ చేయగా కాంగ్రెస్ నుంచి వనమా వెంకటేశ్వరరావు బరిలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన వనమా ఆ తర్వాత టీఆర్‌ఎస్‌లో చేరారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో అధికార పార్టీలో రెండు గ్రూపులు కొనసాగుతూ వస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ పథకాల పరంగా వనమా గ్రూప్ యాక్టివ్‌గా పని చేస్తోంది. జలగం వర్గం తమ ప్రాధాన్యత తగ్గకుండా సైలెంట్‌గా పని చేసుకుంటూ పోతోంది. జలగం, వనమా గ్రూపులు ఉండగానే ఆకస్మాత్తుగా హెల్త్ డైరెక్టర్ గడల శ్రీనివాసరావు సైతం ఇక్కడి నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అందుకు తగ్గట్టుగా జీఎస్‌ఆర్ ట్రస్ట్ పేరుతో ఆయన నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపడుతూ తన వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

సత్తా చూపిన వనమా..



కొత్తగూడెం సీటుకు విపరీతమైనమెన పోటీ నెలకొని ఉన్న నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో తానే బీఆర్‌ఎస్ తరఫున బరిలో ఉంటానని సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా పదేపదే ప్రకటిస్తూ వచ్చారు. ఈ తరుణంలో జిల్లా సమీకృత కార్యాలయాల భవనాల సముదాయం ప్రారంభోత్సవం ఆయనకు కలిసొచ్చింది. సీఎం పర్యటన సందర్భంగా వనమా ఘనంగా ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్ నుంచి బీఆర్‌ఎస్ కార్యాలయం వరకు అంతా గులాబీమయం చేశారు. కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సభలోనూ సీఎం కేసీఆర్, ఇతర పార్టీ ప్రముఖులతో సన్నిహతంగా మెలిగారు. తద్వారా రాబోయే ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి బీఆర్‌ఎస్ తరఫున పోటీలో ఉండేది తానే అనే నమ్మకాన్ని కనబరిచారు. కాగా, సీఎం జిల్లా పర్యటన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు ఎక్కడా కనిపించకపోవడం వనమా వర్గానికి మరింత ధీమాను ఇచ్చింది.

తుమ్మల యాక్టివ్..



ఖమ్మం, కొత్తగూడెం కలెక్టరేట్‌ల ప్రారంభోత్సవాలు, బహిరంగ సభల సందర్భంగా మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీలో మరోసారి యాక్టివ్ అయ్యారు. ముఖ్యంగా కొత్తగూడెం సభ తర్వాత తుమ్మల ఇక్కడి నుంచి పోటీ చేస్తారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జోరుగా సాగింది. దీనిపై ఓ ఇంటర్వ్యూలో తుమ్మల స్పందిస్తూ.. గ్రామీణ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనేది తన అభిలాష అని, కానీ పార్టీ నాయకత్వం ఆదేశాలకు అనుగుణంగా ఎక్కడి నుంచైనా పోటీకి సిద్ధమని ప్రకటించారు. దీంతో గూడెం రాజకీయం రసకందాయంలో పడింది. కొత్తగూడెం నుంచి బీఆర్‌ఎస్ తరఫున బరిలో ఉండే అభ్యర్థుల జాబితా అనే ప్రచారంలో తుమ్మల పేరు కూడా తోడయింది.

ఖమ్మం సభలో జలగం..

కొత్తగూడెంలో జరిగిన బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి జలగం వెంకట్రావు హాజరుకాకపోవడంతో వచ్చే ఎన్నికల్లో ఆయన రూటు ఏమైనా మారుతుందా అనే సందేహాలు మొదలయ్యాయి. అయితే ఖమ్మంలో జరిగిన బీఆర్‌ఎస్ సభకు వెంకట్రావు హాజరు కావడం పొలిటికల్ హీట్‌ను మరింతగా పెంచింది. సీఎం కేసీఆర్ స్వయంగా ఫోన్ చేసి ఖమ్మం సభకు రావాలని ఆహ్వానించడంతో వెనువెంటనే ఆయన ఖమ్మం చేరుకున్నారు. అక్కడ జరిగిన కలెక్టరేట్, కంటి వెలుగు ప్రారంభోత్సవాల్లోనూ భాగస్వాములయ్యారు. దీంతో జలగం పార్టీ మార్పుపై వచ్చిన ఊహాగానాలకు చెక్ పడినట్టయ్యింది. రాబోయే ఎన్నికల్లో కొత్తగూడెమే ఆయన కార్యక్షేత్రమనే సంకేతాలు ఇచ్చినట్టయింది.

ముక్కోటి లెక్క తేలింది..



ముక్కోటి రోజున స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు (ఫైల్)

- రామయ్యకు వీఐపీ టికెట్లతో నష్టం
- ఇతర టికెట్లు, ప్రసాదాల విక్రయంతో రూ.58 లక్షల రాబడి
- మిగులు లడ్డూల ఊసెత్తని ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో జరిగిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాల సందర్భంగా దర్శన టికెట్లు, ప్రసాదాల ఆదాయం లెక్క తేలింది. తెప్పోత్సవం, ముక్కోటి పర్వదినం రోజున రాబడి వివరాలను ఆలయ అధికారులు ప్రకటించారు. టికెట్ల విక్రయాల ద్వారా రూ.36 లక్షలు, ప్రసాదాల విక్రయం ద్వారా రూ.22.30 లక్షల ఆదాయం సమకూరింది. రూ.2వేల విలువైన వీఐపీ టికెట్లు 1400 విక్రయానికి ఉంచగా 1219, రూ.1000 విలువైన టికెట్లు 400కు 400, రూ.500 టికెట్లు 1330కు 1252, రూ. 250 టికెట్లు 650కి 546 అమ్ముడయ్యాయి. ఇక 100 గ్రాముల లడ్డూలు 75,982 అమ్మడం ద్వారా రూ.18,99,550, 400 గ్రాముల లడ్డూలు 2,750 అమ్మగా రూ.2,75,000 వచ్చాయి. పులిహోర, చక్కెర పొంగళి, బెల్లం రవ్వ కేసరి విక్రయాల ద్వారా రూ.55,685 ఆదాయం సమకూరింది. ఉత్తర ద్వార దర్శనం రోజున టికెట్లు, నిత్యాన్నదాన పథకానికి విరాళాలు, ఇతరత్రా ద్వారా రూ.8 లక్షల ఆదాయం వచ్చింది.

వీఐపీ టికెట్లు, లడ్డూలతోనే నష్టం..

ముక్కోటి ఉత్సవాల సమయంలో టికెట్లు మిగలడంతో ఆలయ ఆదాయానికి ఈ ఏడాది సైతం గండి పడింది. జిల్లా ఉన్నతాధికారుల సూచన మేరకు ఆలయ అధికారులు ఈ ఏడాది ముందుగానే టికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచడం సత్ఫలితాలు ఇచ్చింది. అయితే ఆన్‌లైన్, కౌంటర్‌ల ద్వారా మిగిలిన టికెట్ల కంటే రూ. 2వేల విలువైన వీఐపీ టికెట్లు అత్యధికంగా 181 మిగలగా రూ.3.62 లక్షల ఆదాయాన్ని కోల్పోవాల్సి వచ్చింది. ఈ టికెట్లు అత్యధికంగా వీవీఐపీల కోసం రెవెన్యూ అధికారుల స్వాధీనంలో ఉన్నాయని, అందువల్లే మిగిలాయని సమాచారం. వాటిని కూడా భక్తులకు అందుబాటులో ఉంచితే మరికొంత ఆదాయం ఆలయానికి వచ్చేది. ఇక లడ్డూలు మిగలడం వల్ల కూడా నష్టం వాటిల్లింది. ముక్కోటి వేడుకల్లో భక్తుల కోసం 1.50 లక్షల లడ్డూలను సిద్ధం చేయగా, 75 వేల లడ్డూలు మాత్రమే విక్రయించారు. బందోబస్తు, భక్తుల రద్దీ పేరుతో ఆలయానికి తూర్పు ముఖంగా ఉన్న లడ్డూ కౌంటర్లను పోలీసులు మూసివేయించడమే ఈ భారీ నష్టానికి కారణమని తెలుస్తోంది. మిగిలిన 75 వేల లడ్డూలు సైతం విక్రయించగలిగితే మరో రూ.20 లక్షల ఆదాయం రామయ్యకు అదనంగా సమకూరేది. అయితే, ఆదాయ వివరాలను వెల్లడించిన అధికారులు.. భక్తుల కోసం సిద్ధం చేసిన లడ్డూలలో ఎన్ని మిగిలాయి, వాటి ద్వారా ఎంత నష్టం అనే వివరాలను మాత్రం ప్రకటించలేదు. ఇటీవల బూజు పట్టిన లడ్డూలను విక్రయించారని భక్తులు ఆరోపించడం, భద్రాచలం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ నీలిమ ఫిర్యాదుతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కావడం, తద్వారా శాంపిళ్లను పరీక్షలకు పంపడం, దేవాదాయ శాఖ త్రిసభ్య కమిటీ విచారణ జరపడం వంటి అంశాలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చకు దారి తీశాయి. ఈ నేపథ్యంలో దేవస్థానం అధికారులు ప్రకటించే లడ్డూల తయారీ, మిగులు లెక్కలే కీలకంగా మారనున్నాయి.

రాష్ట్రంలో మోడల్‌గా ఉండాలి

మన ఊరు – మన బడి సమీక్షలో కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మన ఊరు–మన బడి కార్యక్రమం కింద చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించాలని, ఈ విషయంలో రాష్ట్రంలోనే జిల్లా మోడల్‌గా ఉండాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఇంజనీరింగ్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపిక చేసిన 46 మోడల్ పాఠశాలలను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలన్నారు. పనులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో గ్రీనరీ, లాన్, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మొదటి విడతలో ఎంపిక చేసిన 368 పాఠశాలల్లో 364 పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయని, మిగిలిన నాలుగు పాఠశాలల్లో ప్రారంభించాల్సి ఉందని చెప్పారు. కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని పాఠశాలల్లో పనులు నత్తనడక నడుస్తున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 30న మరోసారి సమీక్ష నిర్వహిస్తామని, అప్పటివరకు చేపట్టిన పనులకు సంబంధించి ఫొటోలు, వీడియోలతో హాజరు కావాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈఓ సోమశేఖరశర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన కళాకారులు

'సురభి' కళలు అభినందనీయం

కొత్తగూడెంటౌన్: నాటకాలను బతికించడానికి సురభి నాట్యమండలి కళాకారులు చేస్తున్న కృషి అభినందనీయమని కలెక్టర్ అనుదీప్ అన్నారు. కొత్తగూడెంక్లబ్‌లో జరిగిన సురభి నాటకాల ప్రదర్శనల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాయాబజార్ నాటకాన్ని తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వారం రోజులపాటు అద్భుతమైన నాటకాలను ప్రదర్శించారన్నారు. అలనాటి ఘట్టాల ను అద్భుతమైన సెట్టింగ్‌లతో ప్రదర్శించి జిల్లా వాసులను మంత్రముగ్ధులను చేశారని అభినందించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ శ్రీనివాస్, డీఆర్‌ఓ అశోకచక్రవర్తి, డీఈఓ సోమశేఖరశర్మ, పాల్వంచ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసీల్దార్ రంగా ప్రసాద్, కళాకారులు వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనే లక్ష్యం

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు

అశ్వాపురం: సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు అన్నారు. స్థానిక రైతువేదికలో శుక్రవారం ఆయన కంటివెలుగు కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షలు జరుగుతున్న తీరు, కళ్లద్దాల పంపిణీ ఎలా ఉందని అక్కడికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. పరీక్షల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలంతా శిబిరాలకు వచ్చేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం సంద్రలబోడు గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించారు. పీఓ అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు వెంటనే సమాధానాలు చెప్పడంతో బోధనా తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డీడీ రమాదేవి, ఏటీడీఓ నరసింహారావు, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌ఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ సురేష్‌కుమార్, వైద్యాధికారి సంకీర్తన, డాక్టర్ నరహరి, సర్పంచ్‌లు బాణోత్ శారద, రామారావు, పంచాయతీ కార్యదర్శులు కృష్ణచైతన్య, పూజ ఉన్నారు.

'కంటివెలుగు'ను పకడ్బందీగా అమలు చేయాలి

జూలూరుపాడు/సుజాతనగర్ : కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష అన్నారు. జూలూరుపాడు మండలం అనంతారం, సుజాతనగర్ మండలం రాఘవాపురం, సీతంపేటలో ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 18 ఏళ్లు పైబడిన వారంతా పరీక్షలు చేయించుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల క్యాంపులు కొనసాగించాలని సూచించారు. పరీక్షల కోసం వచ్చే వారికి టెంట్లు, కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జూలూరుపాడు, సుజాతనగర్ పీహెచ్‌సీల వైద్యాధికారులు రాకేష్‌కుమార్, బి.రమేష్, వైద్యులు, సిబ్బంది తేజస్విని, రత్నకుమార్, రాధిక, రాజమ్మ, సావిత్రి, పంచాయతీ కార్యదర్శి మల్లిక తదితరులు పాల్గొన్నారు.



జూలూరుపాడు మండలం అనంతారంలో కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న శిరీష

6,639 మందికి పరీక్షలు

చుంచుపల్లి: జిల్లాలో రెండో రోజు కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 36 పంచాయతీలు, 12 మున్సిపల్ వార్డుల్లో కలిపి 6,639 మందికి పరీక్షలు నిర్వహించారు. 2,380 మందికి రీడింగ్ కళ్లద్దాలు పంపిణీ చేయగా, మరో 1,059 మందికి అధిక దృష్టి లోపం ఉందని గుర్తించి ఆన్‌లైన్‌లో కళ్లజోళ్లకు ఆర్డర్ చేశారు.

రెప్పపాటులోనే అనంతలోకాలకు..

- వెడ్డింగ్ షూట్ కోసం వెళ్తూ మృత్యు ఒడిలోకి..
- ఇల్లెందు సమీపంలో ఘోర ప్రమాదం
- ఘటనా స్థలంలో ముగ్గురు.. ఆస్పత్రిలో ఒకరు మృతి
- మరొకరి పరిస్థితి విషమం.. ఖమ్మం తరలింపు
- మృతులంతా ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు



ఘటనాస్థలిలో లారీ (ఇన్‌సెట్) కారులో ఇరుక్కుపోయిన మృతదేహం



అరవింద్



రాము



తీవ్రంగా గాయపడిన రణధీర్

ఇల్లెందు/ఇల్లెందు రూరల్ : వారందరూ మిత్రులు. ఫొటోగ్రఫీ రంగంలో కొనసాగుతున్న వారు వెడ్డింగ్ షూట్ కోసం కారులో పర్యాటక ప్రాంతమైన ఏపీలోని మోతె వెళ్తున్నారు. మార్గమధ్యలో ఇల్లెందు సమీపాన ఎదురుగా వచ్చిన లారీని వీరి కారు ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందారు. కారులో ఉన్న ఇంకొకరి పరిస్థితి విషమంగా ఉండడంతో ఇల్లెందులో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. శుక్రవారం రాత్రి 11గంటల సమయాన జరిగిన ఈ ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తులో ఉండడమా, అతి వేగమా అనేది తెలియాల్సి ఉంది. వివరాలిలా ఉన్నాయి. హన్మకొండ జిల్లా కమలాపురం మండలానికి చెందిన రాము, అరవింద్‌లు వెడ్డింగ్ ఫొటోగ్రాఫర్లుగా పనిచేస్తున్నారు. వీరు ఏపీలోని చింతూరు మండలం మోతెలో ఓ వెడ్డింగ్ షూట్‌లో పాల్గొనేందుకు కమలాపురం నుంచి కారు(టీఎస్ 03 ఎఫ్‌సీ 9075)లో శుక్రవారం సాయంత్రం బయల్దేరినట్టు తెలుస్తోంది. వీరికి రణధీర్, రుషి, కల్యాణ్ హన్మకొండలో జత కలిశారు. ఆ తర్వాత ఐదుగురు కలిసి మహబూబాబాద్ మీదుగా మోతె వెళ్తుండగా ఇల్లెందు సమీపంలోని జెండాలవాగు సమీపాన ఎదురుగా వస్తున్న లారీని కారు బలంగా ఢీ కొట్టింది. ప్రమాద ధాటికి కారు ముందు భాగం, ఇంజన్ నుజ్జునుజ్జు కాగా, ఐదుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈమేరకు ముగ్గురు ప్రమాద స్థలిలోనే మృతి చెందగా, ఆ మార్గంలో వెళ్తున్న వాహనదారులు గాయపడిన వారిని కాపాడేందుకు ప్రయత్నించారు. వెనువెంటనే 108కు సమాచారం ఇవ్వగా గాయపడిన ఇద్దరిని ఇల్లెందు ఆస్పత్రికి తీసుకువచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ కమలాపూర్‌కి చెందిన అరవింద్ మరణించారు. మరొకరైన నర్సంపేటకు చెందిన రణధీర్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారులోనే ముగ్గురు..

లారీ, కారు వేగంగా వస్తూ ఎదురెదురుగా ఢీకొనడంతో కారు ముందు సీట్లలో కూర్చున్న ఇద్దరికి బలమైన గాయాలై అక్కడికక్కడే చనిపోయారు. ఎయిర్ బ్యాగులు తెరుచుకున్నప్పటికీ ఫలితం లేకపోయింది. సీట్లలో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. గాయపడిన వారిని తొలుత ఆస్పత్రికి తరలించి, ఆ తర్వాత వెనక్కి వచ్చిన పోలీసులు ముందు సీట్లలో ఇరుక్కున మృతదేహాలను కట్టర్ల సాయంతో తీశారు. కాగా, ఘటనాస్థలిలోనే ముగ్గురు, ఆస్పత్రికి తరలించాక ఇంకొకరు మృతి చెందడం, మరొకరు అపస్మారక స్థితిలో ఉండడంతో వీరెవరు, ఎక్కడ నుంచి ఎక్కడకు వెళ్తున్నారనేది తొలుత గుర్తించలేకపోయారు. ఆతర్వాత సెల్‌ఫోన్లలో సమాచారం ఆధారంగా కమలాపురం నుంచి మోతె వెళ్తున్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుల వయస్సు 30 నుంచి 45 ఏళ్ల మధ్యలో ఉంటుంది. కడపటి సమాచారం అందేసరికి ఐదుగురి పేర్లు తెలిసినా, మిగతా వివరాలపై స్పష్టత రాలేదు. కారు రాంగ్‌రూట్‌లో వెళ్లి లారీని ఢీకొట్టడంతోనే ఘటన జరిగినట్లు సమాచారం.

సంక్షోభం నుంచి బయటపడేందుకే..

- విద్యుత్ సంస్థలకు అధిక నిధులు
- రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ తన్నీరు శ్రీరంగారావు

సూపర్‌బజార్(కొత్తగూడెం): విద్యుత్ సంక్షోభం నుంచి రాష్ట్రాన్ని బయటపడేసేందుకు విద్యుత్ సంస్థలకే ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తోందని రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ తన్నీరు శ్రీరంగారావు అన్నారు. కొత్తగూడెం క్లబ్‌లో శుక్రవారం వినియోగదారులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెరుగైన సౌకర్యాల కోసం రూ. 38వేల కోట్లు, విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రూ 45వేల కోట్లు, సబ్సిడీలకు రూ.875 కోట్లు కేటాయించిందని చెప్పారు. చట్టం కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడాలని కోరారు. 27 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ ఇస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాతో సాగు పెరిగిందని అన్నారు. జిల్లాలో విద్యుత్ సమస్యలపై తప్ప ఎవరూ అధికారులపై ఫిర్యాదు చేయలేదంటూ సిబ్బందిని అభినందించారు. వినియోగదారులకు ఏమైనా సమస్యలుంటే 1912, 18004 250028 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సమావేశంలో మండలి టెక్నికల్ మెంబర్ ఎండి మనోహర్‌రాజు, ఫైనాన్స్ మెంబర్ బండారు కృష్ణయ్య, సెక్రటరీ ఎం.నాగరాజు, జాయింట్ డైరెక్టర్ లక్ష్మణ్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు బి. వెంకటేశ్వరరావు, పి.గణపతి, సీజీఎం మధుసూదన్ రావు, ఎస్ఈ కె.రమేష్, సీనియర్ ఏఓ మురళి, డీఈలు టి.శేషాద్రి, కె.జీవన్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తన్నీరు శ్రీరంగారావు, పక్కన అధికారులు

నర్సరీలకు వ్యవసాయ మీటర్లు పెట్టాలి



జిల్లాలో ఉన్న ఆరు నర్సరీలకు వ్యవసాయ మీటర్లు మంజూరు చేసి ఉచిత విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలి. తద్వారా ఉద్యాన శాఖకు కొంత భారం తగ్గుతుంది.

– జినుగు మరియన్న, ఉద్యాన శాఖాధికారి

క్లుప్తంగా

రుణాలు చెల్లించనివారి ఆస్తుల జప్తునకు నిర్ణయం

పాల్వంచరూరల్: మండలంలోని 39 డ్వాక్రా గ్రూపుల మహిళలు బ్యాంకుల ద్వారా రూ.12 కోట్ల రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని, వారి చరాస్తులను జప్తు చేయాలని బ్యాంకర్లు, ఐకేపీ అధికారులు తహసీల్దార్ రంగా ప్రసాద్‌కు విన్నవించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఐకేపీ అధికారులు, పలు బ్యాంక్‌ల మేనేజర్లు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డ్వాక్రా గ్రూపు సంఘాల మహిళలు 2008, 2009 సంవత్సరాల్లో బ్యాంక్‌ల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించని వారి నుంచి రెవెన్యూ రికవరీ యాక్టు ద్వారా స్థిర, చరాస్తులను జప్తు చేసి సంబంధిత బ్యాంకులకు జమ చేయాలని నిర్ణయించారు. సమావేశంలో పలు బ్యాంకుల మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు దిలీప్ శుక్లా, దిలీప్‌రావు, తేజ్, ఐకేపీ ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

ఏజెన్సీ నుంచి కేరళకు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏజెన్సీ ప్రాంతానికి చెందిన 30 మంది విద్యార్థులు ఈ నెల 23 నుంచి 29 వరకు కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జరగనున్న 14వ గిరిజన యువజన సమ్మేళనంలో పాల్గొనేందుకు శుక్రవారం తరలివెళ్లారు. సీఆర్పీఎఫ్ అధికారులు వారిని తీసుకెళ్లారు. వీరంతా వారం రోజుల పాటు అక్కడ జరిగే పలు సాంస్కృతిక, భాషా, జీవనశైలి, విద్యా మార్గాలు, అభివృద్ధి కార్యకలాపాలు, విద్యా అవకాశాలపై నిర్వహించే కార్యక్రమాలకు హాజరై అవగాహన పెంచుకుంటారు. కార్యక్రమంలో 141 సీఆర్పీఎఫ్ కమాండెంట్ ప్రశాంత్ ధర్‌తో పాటు సెకండ్ ఇన్ కమాండెంట్ కమల్వీర్‌యాదవ్, డిప్యూటీ కమాండెంట్ శింగర ర్వేల్, వైద్యులు కల్పన, ఎస్‌ఎంఓ విజయ్‌కిశోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం సాయినగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. వీకేర్ ఆస్పత్రి మేనేజర్ సిలార్ గురువారం రాత్రి ఆస్పత్రిలో విధులకు వెళ్లారు. ఆయన ఇంట్లో ఎవరూ లేనట్లుగా గుర్తించిన దుండగులు అర్ధరాత్రి సమయాన తాళం పగులగొట్టి మూడు తులాల బంగారం, 25 తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఘటనపై శుక్రవారం సిలార్ చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రవీణ్ తెలిపారు.

వాహనం ఢీకొని బాలికకు గాయాలు

గుండాల: రోడ్డు పక్కన ఆడుకుంటున్న పాపను వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మొదుగులగూడెం గ్రామానికి చెందిన నెల్లూరి సుమశ్రీ ఇంటి ముందు రోడ్డు పక్కన ఆడుకుంటుండగా గుండాలపైపు వెళ్తున్న మ్యాజిక్ వాహనం కాలుపై ఎక్కించగా తీవ్ర గాయమైంది. వెంటనే గుండాల ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మంకు తరలించారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

దుమ్ముగూడెం: మండలంలోని సుజ్ఞానపురం, ములకనాపల్లి గ్రామాలలో నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సుజ్ఞానపురం గ్రామంలో 200 లీటర్ల బెల్లం పానకం, ములకనాపల్లి గ్రామంలో 500 లీటర్ల పానకాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు గ్రామంలో దాడులు నిర్వహిస్తుండటంతో సుజ్ఞానపురం గ్రామంలోని సారా తయారీ దారులు దగ్గరలోని అటవీప్రాంతంలోకి పారిపోయారు. రెండు గ్రామాల్లోని ప్రతి ఇంటిని ఎక్సైజ్ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. దాడులలో అధికారులు కరంచంద్, రాజిరెడ్డి, మురళీకృష్ణ, లత, సిబ్బంది పాల్గొన్నారు.

11 మందిపై కేసు

పాల్వంచరూరల్: భూమి కోసం అన్నదమ్ములు ఘర్షణ పడి పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో 11 మందిపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పునుకుల గ్రామానికి చెందిన ఏడుగురు అన్నదమ్ములకు చెందిన రెండు ఎకరాల భూమి ఉంది. ఈ భూమి పంపకం వివాదం కోర్టులో నడుస్తోంది. శుక్రవారం పొలం పనులు చేస్తున్న బొల్లం వీరయ్య, బొల్లం వీరమ్మను సోదరుడైన రాములు, గంగమ్మ కొట్టారు. అనంతరం రాములు, గంగమ్మను వీరయ్య అతని భార్య మరికొంత మంది కలిసి కొట్టారు. ఇరువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాలకు చెందిన 11 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి ఇంటికి..

పాల్వంచ: తండ్రి మందలించాడని వెళ్లిపోయిన విద్యార్థి ఇంటికి చేరాడు. పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఎండీ షఫీఅహ్మద్ కుమారుడు ఇక్బాల్ ఎనిమిదో తరగతి చదువుతుండగా, చదువులో వెనుకబడ్డాడని గురువారం తండ్రి మందలించాడు. దీంతో స్కూల్ నుంచి ఇంటికి రాగానే ఇక్బాల్ నగదు తీసుకుని వెళ్లిపోయాడు. ఎస్సైలు నరేశ్, ప్రవీణ్ ఆధ్వర్యాన గాలింపు చేపట్టగా హైదరాబాద్ వెళ్లాడనే సమాచారంతో అక్కడి ఎంజీబీఎస్‌కు వెళ్లి వెతికారు. ఈమేరకు బస్టాండ్‌లో కూర్చున్న ఇక్బాల్‌ను పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి తండ్రికి అప్పగించారు. సాయంత్రం వెళ్లిన విద్యార్థి ఆచూకీ మరుసటి తెల్లారేసరికి లభిచడంతో పోలీసులతో పాటు కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు.

బొగ్గు శుద్ధి.. ఇక ఉండదు..

ఈ నెల 24న మూతపడనున్న ఫ్యాక్టరీ

- భారంగా మారిన నిర్వహణ
- వీధిన పడనున్న 170 కుటుంబాలు
- ప్రత్యామ్నాయం చూపాలని వేడుకోలు


మూసివేతకు సిద్ధమైన మణుగూరు ఏరియా గ్లోబల్ కోల్ వాషరీ ప్లాంట్

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియాలోని గ్లోబల్ కోల్ వాషరీ ప్లాంట్ మూసివేతకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మణుగూరు ఏరియాలోని ఓపెన్‌కాస్టు గనుల్లో లభించే జీ–15 గ్రేడ్ బొగ్గును శుద్ధిచేసి జీ–9గా మార్చి బొగ్గు నాణ్యత పెంచేందుకు 2009లో ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను కనీసం 30 సంవత్సరాల పాటు కొనసాగిస్తామని నాడు అధికారులు ప్రకటించారు. దీంతో ఈ ప్రాంతానికి మరో పరిశ్రమ వచ్చిందని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయనే ఆశతో పర్యావరణ కాలుష్యాన్ని సైతం లెక్కచేయకుండా ఏరియా వాసులు అంగీకరించారు.

భారంగా నిర్వహణ

సింగరేణి ఓసీల్లో వచ్చే జీ–15 గ్రేడ్‌ను గతంలో పవర్‌ప్లాంట్లు తీసుకోకపోవడంతో సింగరేణి యాజమాన్యం దాన్ని జీ–9 గ్రేడ్‌గా మార్చి విద్యుత్ సంస్థలకు సరఫరా చేసేది. ప్లాంట్ నిర్మాణ సమయంలో పదేళ్ల పాటు 100 లక్షల టన్నుల బొగ్గును శుద్ధిచేసి అందిస్తామని ఒప్పందం చేసుకుంది. నాటి నుంచి నిత్యం 173 మంది ఉద్యోగులు ప్లాంట్‌లో పనిచేస్తూ సింగరేణి అందించిన బొగ్గును శుద్ధి చేసేవారు. టన్ను బొగ్గు శుద్ధి చేసేందుకు రూ.210 ఖర్చవుతుంది. గతంలో జీ–15 గ్రేడ్ బొగ్గు టన్ను ధర రూ.970 ఉండగా, ప్రస్తుతం రూ.1,620కి చేరింది. ఇలాంటి తరుణంలో బొగ్గు శుద్ధిచేయడం మరింత భారంగా ఉండటం వల్ల సింగరేణి యాజమాన్యం బొగ్గును శుద్ధి చేసేందుకు సుముఖంగా లేదు. దీంతో కంపెనీ యాజమాన్యం సైతం దాన్ని నిర్వహించడం సాధ్యం కాదనే సాకుతో కంపెనీని మూసివేయడానికి సిద్ధమైంది.

చేతులెత్తేసిన సింగరేణి..

తొలుత 10 సంవత్సరాల్లో 100 లక్షల టన్నుల బొగ్గును ఇవ్వడానికి అంగీకరించిన యాజమాన్యం 2020 నాటికి 73 లక్షల టన్నులు మాత్రమే ఇచ్చింది. ఇచ్చిన కాలపరిమితిలో సింగరేణి తమకు ఇవ్వాల్సిన బొగ్గు ఇవ్వలేదని గ్లోబల్ కంపెనీ కోరడంతో నిబంధనల ప్రకారం మరో 3 సంవత్సరాల్లో మిగిలిన 27 లక్షల టన్నుల బొగ్గు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఇంకా 10 లక్షల టన్నులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ యాజమాన్యం తాము ఇవ్వలేమని తేల్చి చెప్పింది. దీంతో గ్లోబల్ కంపెనీ సైతం నిర్వహణ సాధ్యం కాకపోవడంతో కంపెనీని ఈ నెల 24న మూసివేయడానికి అన్నిరకాల ఏర్పాట్లు చేసింది.

రోడ్డున పడనున్న 170 కుటుంబాలు

మణుగూరు ఏరియాలోని గ్లోబల్ కోల్ వాషరీ ప్లాంట్ మూసివేయడం వల్ల 170 కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. ఈ కంపెనీని నమ్ముకొని సుమారు 12 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు ఉపాధి కల్పోనున్నారు. ఈ నెల 24 నుంచి తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు ఈ కంపెనీని నమ్ముకొని పనిచేసిన గ్లోబల్ కంపెనీ ఉద్యోగులు 73 మంది, అందులో పనిచేసే కాంట్రాక్టు కార్మికులు 100 మంది.. ఏం చేయాలో పాలుపోని స్థితి వచ్చిందని వాపోతున్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం తమ గురించి ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

మాకు ప్రత్యామ్నాయం చూపాలి



ఈ కంపెనీలో కాంట్రాక్టు డ్రైవర్‌గా 12 సంవత్సరాలుగా పని చేస్తున్నాను. ఇప్పుడు కంపెనీ మూసివేడయం వల్ల మా కుటుంబాలు రోడ్డున పడతాయి. సింగరేణి యాజమాన్యం వెంటనే తమకు ప్రత్యామ్నాయం చూపాలి. ఇక్కడ పనిచేసిన తమకు సింగరేణి ఓబీ కంపెనీల్లో అవకాశాలు కల్పించి ఆదుకోవాలి. మా కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలి.

– ఎన్.శ్రీనివాస్, గ్లోబల్ కంపెనీ డ్రైవర్, మణుగూరు

ఉద్యోగులు, కార్మికులను ఆదుకోవాలి



మణుగూరు ఏరియా గ్లోబల్ కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులను కార్మికులను ఆదుకోవాలి. కంపెనీ మూసివేస్తున్న తరుణంలో వారంతా ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. వారికి సింగరేణి ఓబీ కంపెనీల్లో ప్రత్యామ్నాయం చూపాలి. వారికి రావాల్సిన బెనిఫిట్లు అన్నీ వెంటనే ఇచ్చే విధంగా చూడాలి. కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి. వారికి తగిన ఉపాధి అవకాశాలు చూపించాలి.

– దురాగ్యల సుధాకర్, సీపీఐ పట్టణ కార్యదర్శి

క్రికెట్ ఆడుదాం.. ప్రతిభను చాటుదాం

ఈ నెల 22 సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ ఎంట్రీలకు చివరి తేదీ

SAKSHI DIGITAL MEDIA GROUP

SPL SAKSHI PREMIER LEAGUE

బ్యాట్ పట్టుకొని బంతిని బౌండరీ దాటించాలని ఉందా? బుల్లెట్ వేగంతో బంతులు వేస్తూ వికెట్లను గిరాటేయాలని ఉందా? మెరుపు వేగంతో కదులుతూ బ్యాటర్లను రనౌట్ చేయాలని ఉందా? క్రికెట్ ఆడేద్దామని.. మనలోని ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పాలని మనసులో బలమైన కోరిక ఉంటే సరిపోదు.. దానికి వేదిక కూడా కావాలిగా! ఇలాంటి ఔత్సాహిక క్రికెటర్లు తమ కలలు నెరవేర్చుకునేందుకు మళ్లీ సమయం వచ్చేసింది. మరో ఆలోచన లేకుండా ముందుగా మీ జట్టును తయారు చేసుకొని ఎంట్రీలు పంపించండి.. ఆ తర్వాత సమరానికి సై అనండి.

Regional sponsor

SUDHAKAR PIPES AND FITTINGS LEADER IN QUALITY AND TECHNOLOGY

ఔత్సాహిక క్రికెటర్లకు సువర్ణావకాశాలు కల్పించాలనే సదుద్దేశంతో సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఈ నెల(జనవరి) నాలుగో వారంలో సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నీ నాలుగో సీజన్ మొదలుకానుంది.

టోర్నీ ఫార్మాట్..

ముందుగా జిల్లా, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లను 10 ఓవర్లపాటు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన జట్లు ప్రాంతీయ స్థాయి టోర్నీకి అర్హత సాధిస్తాయి. ఈ మ్యాచ్‌లను 20 ఓవర్లపాటు నిర్వహిస్తారు. ప్రాంతీయ స్థాయి టోర్నీ విజేతలు రాష్ట్ర స్థాయిలో రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో టైటిల్ కోసం తలపడతాయి. ఉమ్మడి జిల్లాలే ప్రాతిపాదికగా ఎంట్రీలు స్వీకరిస్తారు.

ఎంట్రీ ఫీజు..

ఈ టోర్నీలో పాల్గొనాలనుకునే జట్లు రూ.1,500 ఎంట్రీ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మొత్తాన్ని ఆన్‌లైన్‌లోనూ, ఆఫ్‌లైన్ పద్ధతిలోనూ చెల్లించవచ్చు. వివరాలకు సాక్షి జిల్లా యూనిట్ కార్యాలయంలో సంప్రదించాలి. https://www.arenaone.in/registration వెబ్‌సైట్‌లోనూ వివరాలు లభిస్తాయి. ఎంట్రీలను ఈ నెల 22తేదీలోపు పంపించాలి.

ఏ ఏ విభాగాల్లో...

ఈ లీగ్‌ను రెండు కేటగిరీల్లో నిర్వహిస్తారు. అండర్–19 జూనియర్ స్థాయిలో (1 జనవరి 2003 తర్వాత జన్మించి ఉండాలి). అండర్–25 సీనియర్ స్థాయిలో (1 జనవరి 1997 తర్వాత జన్మించి ఉండాలి) వేర్వేరుగా నిర్వహిస్తారు.

జూనియర్ స్థాయిలో ఆడేందుకు జూనియర్ కాలేజీ జట్లకు, సీబీఎస్‌ఈ స్కూల్ (ప్లస్ 1, 2) జట్లకు, ఐటీఐ, పాలిటెక్నిక్ జట్లకు అర్హత ఉంది. సీనియర్ స్థాయిలో ఆడేందుకు డిగ్రీ, పీజీ, మెడిసిన్, ఇంజినీరింగ్, ఫార్మా కాలేజీ జట్లకు అవకాశం కల్పిస్తారు.

ఎన్ని జట్లకు అవకాశం..

ఒక్కో కాలేజీ నుంచి గరిష్టంగా రెండు జట్లను పంపించే వెసులుబాటు ఉంది. రెండు జట్లు కూడా వేర్వేరుగా ఎంట్రీ ఫీజు చెల్లించాలి. ఒక జట్టులో ఆడే ఆటగాడు మరో జట్టుకు ఆడకూడదు. మ్యాచ్‌లు ఆడే సమయంలో ఆటగాళ్ల వయసు ధ్రువీకరణ పత్రాలను చూపించాల్సి ఉంటుంది. మ్యాచ్ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు తమ కళాశాల గుర్తింపు కార్డు (ఒరిజినల్) చూపించాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాటర్స్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్ ప్యాడ్‌లు, అండర్ గార్డ్స్, హ్యాండ్ గ్లౌవ్స్, వైట్ డ్రెస్, వైట్ షూస్ ధరించాలి.

ఇతర వివరాలకు నిర్వాహకులను సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ : 96660 13544

గమనిక: అన్ని విషయాల్లో నిర్వాహకులదే తుది నిర్ణయం.

'డబుల్' ఇళ్లు మంజూరు చేయాలని ఆందోళన

- ఎన్డీ ఆధ్వర్యంలో భారీ నిరసన ప్రదర్శన
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి


ఎన్డీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రజలు


ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్డీ నేతలు

ఇల్లెందు: డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రజలు భారీ ప్రదర్శన నిర్వహించారు. ఇల్లెందు పట్టణంలో ఎన్డీ నాయకులతో కలిసి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించగా పోలీసులు అడ్డుకున్నారు. ఇల్లెందు ఎన్డీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు, యువకులు ధరఖాస్తులు చేతబట్టుకుని ప్రదర్శనలో పాల్గొన్నారు. అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని గోవింద్‌సెంటర్ నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పోలీసులు అడ్డుకున్నారు. సీఐ బి.రాజు, ఎస్‌ఐ రాజేశ్ బందోబస్తు మధ్య ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం అందజేసేందుకు అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలు లక్షల్లో ఉన్నారని, వారంతా వీధుల్లో నివసిస్తున్నారని తెలిపారు. బంగారు తెలంగాణ అని చెబుతున్న రాష్ట్రంలో ఇళ్లు లేని వారి బతుకులు చెప్పలేని విధంగా ఉన్నాయని, వారంతా నరకం అనుభవిస్తున్నారని చెప్పారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ 8 ఏళ్లలో ఒక్క ఇల్లు కట్టలేదని, కట్టిన ఇళ్లు పంపిణీ చేయలేదని ఆరోపించారు. తక్షణమే అర్హులందరికీ ఇళ్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, పొడుగు నర్సింహారావు, తోడేటి నాగేశ్వరరావు, సూర్నపాక నాగేశ్వరరావు, చింత ఉదయ్, ఎల్.చిన్నస్వామి, కల్తీ వెంకటేశ్వర్లు, ఎట్టి నర్సింహారావు, మంగలత, కల్తీ కోటమ్మ, జోగ కృష్ణ, బి.సంగయ్య, బి.రాజు, వజ్జ మధు, భూక్యా మాంగ్యా, గొగ్గెల రామచంద్రు, వీరన్న, జటంగి వెంకన్న, సామేలు, రామిశెట్టి నర్సింహారావు, మూడు మాలు, సదయ్య, రాంచందర్, సర్పంచ్‌లు మోకాళ్ల కృష్ణ, సరోజిని, సంతూ, శ్రీను, కల్తీ సీతారాములు, కోటన్న, వి.మోతీలాల్, రమేశ్, శ్రీరాములు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కుటుంబానికి పలువురి పరామర్శ


ఎమ్మెల్సీ మధు, కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కందాల

తిరుమలాయపాలెం: బెంగళూరులో గురువారం రోడ్డు ప్రమాదంలో ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సోదరుడు విశ్వేశ్వరరావు కుమారుడు నిఖిల్ మృతి చెందగా స్వగ్రామమైన పిండిప్రోలులో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించారు. నిఖిల్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో శుక్రవారం మధ్యాహ్నం పిండిప్రోలుకి తీసుకురాగా, ఆయన కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న ఆయన మరణంతో తల్లిదండ్రులు విశ్వేశ్వరరావు – నాగమణి రోదిస్తుండగా ఆపడం ఎవరి తరం కాలేదు. కాగా, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు కందాల ఉపేందర్‌రెడ్డి, సండ్ర వెంకటవీరయ్య, హరిప్రియ, రాములునాయక్, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్, చంద్రావతి, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, పోటు ప్రసాద్, బాగం హేమంతరావు మంగీలాల్, బెల్లం ఉమ, చావా శివరామకృష్ణ, చావా వేణు, రాయల నాగేశ్వరరావు తదితరులు నిఖిల్ మృతదేహం వద్ద నివాళులర్పించి ఎమ్మెల్సీ కుటుంబాన్ని పరామర్శించారు.

పీఆర్ డిప్లొమా ఇంజనీర్స్ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన డిప్లొమా ఇంజనీర్స్ జిల్లా కమిటీ సభ్యులు

చుంచుపల్లి: పంచాయతీ రాజ్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీకి అధ్యక్షులుగా జె.నాగేందర్, ఉపాధ్యక్షులుగా టి.అఖిల్, జనరల్ సెక్రటరీగా కె.ఆంజనేయులును ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎ.శ్రీనివాస్, ఫైనాన్స్ సెక్రటరీగా పి.శారద, జాయింట్ సెక్రటరీగా లక్ష్మణ్ ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా అల్లి నవీన్, నిర్మల, అక్షిత, చారి, జయరాజ్ కొనసాగనున్నారు. కొత్తగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులను పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుధాకర్ అభినందించారు.

ఐదుగురిపై కేసు నమోదు

గుండాల: అదనపు కట్నం కోసం వేధించడమే భార్యతోపాటు ఆమె కుటుంబ సభ్యులపై దాడిచేసిన ఐదుగురిపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కాచనపల్లికి చెందిన దుంప రాములు తన కుమార్తె శైలజను అదే గ్రామానికి చెందిన రాంబాబుకు ఇచ్చి వివాహం జరిపించాడు. వివాహ సమయంలో రూ.5 లక్షలు కట్నం ఇచ్చాడు. కాగా, కొంతకాలంగా రాంబాబు అదనపు కట్నం కోసం శైలజను వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ అంశంపై పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చినా, పెద్దలు పంచాయితీ నిర్వహించినా రాంబాబు వైఖరిలో మార్పు రాలేదు. అంతేకాకుండా రాంబాబు మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని, మూడు రోజుల కిందట సదరు మహిళను ఇంటికి తీసుకొచ్చాడని శైలజ తెలిపింది. ఇదే విషయమై రాంబాబును ప్రశ్నించగా అతడి కుటుంబ సభ్యులు శైలజతోపాటు ఆమె కుటుంబ సభ్యులపై కత్తులు, గొడ్డలితో దాడి చేశారు. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దాడి చేసిన ఓర్సు రాంబాబు, ఎర్ర వెంకన్న, సారమ్మ, మల్లయ్య, రాధపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రతీశ్ తెలిపారు.

పాఠశాల సమయంలో కల్లు దుకాణానికి..

విద్యార్థిని బైక్‌పై ఎక్కించుకుని వెళ్లిన ఉపాధ్యాయుడు

పాల్వంచ: పాఠశాల సమయంలో ఓ విద్యార్థిని బైక్‌పై ఎక్కించుకుని కల్లు దుకాణానికి వెళ్లాడో ఉపాధ్యాయుడు. మున్సిపాలిటీ పరిధిలోని పేటచెరువు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు వెంకటరమణ.. అదే పాఠశాలలో చదివే ఆరో తరగతి విద్యార్థి సంతోష్‌తో కలిసి బైక్‌పై పిల్లవాగులోని కల్లు దుకాణానికి వెళ్లాడు. గుర్తించిన స్థానికులు ఉపాధ్యాయుడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, సంతోష్ అనే విద్యార్థి పాఠశాలకు రాకపోవడంతో అడిగేందుకు వెళ్లానని ఉపాధ్యాయుడు చెబుతున్నాడు. ఈ విషయాన్ని ఎంఈఓ శ్రీరాంమూర్తికి సమాచారం అందించారు. ఈ ఘటనపై ఎంఈఓను వివరణ కోరగా విచారణ చేసి నివేదిక ఇవ్వాలని సీఆర్‌పీని ఆదేశించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

ముగ్గురికి తీవ్రగాయాలు


చిన్నారి గాయత్రి మృతదేహం

ఇల్లెందురూరల్: పసిపాపకు జ్వరం వస్తోందని ఆస్పత్రికి బయలుదేరిన కుటుంబానికి తీరని శోకం మిగిలింది. మార్గమధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆ పసిపాప మృతిచెందింది. మండలంలోని మాణిక్యారానికి చెందిన మంజుల కుమార్తె, ఏడాదిన్నర వయస్సు ఉన్న గాయత్రి రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. జ్వరం ఎంతకీ తగ్గకపోవడంతో తన తల్లి మాలోత్ రాజీ, సోదరుడు రామకృష్ణను తీసుకుని కారులో బయలుదేరింది. కొమ్ముగూడెం గ్రామపంచాయతీ అశోక్‌నగర్ సమీపాన మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి కారు బోల్తాపడింది. ఈ ఘటనలో గాయత్రి అక్కడికక్కడే మృతిచెందింది. చిన్నారి తల్లి మంజుల, అమ్మమ్మ మాలోత్ రాజీ, మేనమామ రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు వారిని ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం రామకృష్ణ, మాలోత్ రాజీ, మంజులను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

చట్టం జోలికొస్తే తరిమికొడతాం..

ఆదివాసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర


మాట్లాడుతున్న వాసం రామకృష్ణదొర

కొత్తగూడెంఅర్బన్: 1/70 చట్టం జోలికొస్తే ఏజెన్సీ నుంచి తరిమికొడతామని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర హెచ్చరించారు. శుక్రవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ భూభాగం ఆదివాసుల రక్షణ, హక్కుల కోసం ఏర్పడిన 1/70 చట్టం ఎత్తివేయాలని, వలస గిరిజనేతరులు సుప్రీంకోర్టులో వేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై అభ్యంతరం వ్యక్తం చేశారు. 1/70 చట్టం జోలికొస్తే గిరిజనేతరులను ఏజెన్సీ నుంచి తరిమికొడతామని హెచ్చరించారు. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డ్ భూభాగానికి ప్రత్యేక అధికారాలతోపాటు ఆదివాసులకు హక్కులు, చట్టాలు ఉన్నాయని తెలిపారు. 1970 తర్వాత వచ్చిన కొంతమంది వలస గిరిజనేతరులు ఏజెన్సీలో ఉన్న అపారమైన వనరులను దోపిడీ చేసేందుకు 1/70 అడ్డంకిగా ఉందనే భావనతోనే సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారని, ఇప్పటివరకు 1/70 చట్టం ఎత్తివేయాలని సుప్రీంకోర్టులో 90 సార్లు గిరిజనేతరులు పిటిషన్‌లు వేశారని వారందరికీ కోర్టులో చుక్కెదురైందని పేర్కొన్నారు. గిరిజనేతరుల హక్కులకు భంగం వాటిల్లుతుందని ఆరోపిస్తున్న వారే.. ఏవిధంగా 2017లో సాదాబైనామా పట్టాలు పొందారని ప్రశ్నించారు. ఏజెన్సీ వ్యాప్తంగా అక్రమ బహుళ అంతస్తుల నిర్మాణాలు, వ్యాపారాలు, స్థిరాస్తులు కూడబెట్టుకుని, రాజకీయ పదవులు ఏవిధంగా అనుభవిస్తున్నారో గిరిజనేతరులే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు ఎట్టి శ్రీనివాసరావు, జేఏసీ నాయకులు తాటి పుల్లయ్య, విద్యార్థి కన్వీనర్ కలివేటి ప్రవీణ్, వజ్జ శ్రీను, వాడే రామకృష్ణ, కంగల వసంత్ తదితరులు పాల్గొన్నారు.